మన సమగ్ర ప్రజావాణి

RNI NO:TGTEL/25/A5443

ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...

5 PM

మంగళవారం , 27, అక్టోబర్ , 2026

తెలుగు డైలీ

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

https://epaper.prajavaani.net


# సత్యం శివం సుందరం

## - సేవ్ ఓట్ ర్యాలీ వేళ రాహుల్ గాంధీ ఆసక్తికర పోస్ట్




**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన సోషల్ మీడియా ఖాతాలో చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘంతో వివాదం కొనసాగుతున్న వేళ శివుడికి ప్రతీకగా ఉన్న మూడు అడ్డగీతల విభూది, నిలువుగా ఉన్న ఎర్రటి కుంకుమ రేఖతో కూడిన చిత్రాన్ని ఆయన పంచుకున్నారు. ఇవి శివుని సంకల్పం, జ్ఞానం, క్రియ అనే మూడు శక్తులకు ప్రతీకలని పండితులు చెబుతుంటారు. ఈ పోస్ట్?కు సంస్కృతంలో "సత్యం శివం సుందరం" అనే వ్యాఖ్యను జోడించారు.అంతకుముందు ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను రాహుల్ గాంధీ 'శివ తాండవం'తో పోల్చారు. ఈ ఉద్యమానికి ఎటువంటి ముందస్తు ప్రణాళిక అవసరం లేదని చెప్పారు. ఈ నిరసన ఒక నిర్ణీత ప్రణాళికపై ఆధారపడి లేదని, ఇది వివిధ రూపాల్లో కొనసాగుతుందని పేర్కొన్నారు. "మేము బస్సులో వెళ్లి, అక్కడ కూర్చుని, అరెస్టు కావాలని అనుకున్నాం. కానీ పోలీసులు మమ్మల్ని అనుమతించలేదు, అందుకే మేము ప్రణాళికను మార్చుకున్నాం. ఫలితం ప్రణాళిక వల్ల వచ్చిందా లేక ప్రణాళిక లేకపోవడం వల్ల వచ్చిందా? దీనికి ఎలాంటి ప్రణాళిక అవసరం లేదు. ఈ తాండవం కొనసాగుతూనే ఉంది. ఇది శివుని తాండవం. ఇందులో ఎవరైనా చేరవచ్చు. ఎవరైతే ఇందులో భాగస్వాములు కావాలనుకుంటారో వారు రావచ్చు" అని రాహుల్? గాంధీ అన్నారు. అటు 2024 జులై 1న లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా కూడా రాహుల్ గాంధీ శివుని ప్రస్తావించారు.

# ఈటల రాజేందర్ పాదయాత్రకు బ్రేక్.. అనుమతి నిరాకరించిన పోలీసులు

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు డిమాండ్‌తో యాత్రకు పిలుపు
- ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో ప్రారంభానికి ముందే ఉద్రిక్తత
- ఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటించే హక్కు ఉందన్న ఈటల
- గతంలో ఇదే అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారని గుర్తు చేసిన బీజేపీ ఎంపీ



**హైదరాబాద్ :** మల్కాజ్‌గిరి ఎంపీ, భారతీయ జనతా పార్టీ నేత ఈటల రాజేందర్ తలపెట్టిన "మహా పాదయాత్ర"కు పోలీసులు అనుమతి నిరాకరించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈరోజు ఉదయం ఈ యాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ నుంచి నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈటల రాజేందర్ ఉదయాన్నే ఏదులాబాద్ చేరుకుని, స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5,000 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. పోలీసుల చర్యపై ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకునే హక్కు తనకుందని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి కోరినట్లు వెల్లడించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇదే జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంటులో మాట్లాడారని ఈటల గుర్తుచేశారు. నాడు రేవంత్ రెడ్డి లేవనెత్తిన అంశంపైనే ఇప్పుడు తాను పాదయాత్ర చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

# స్థానికాల్లోనూ అదే స్ఫూర్తి.. కూటమిని గెలిపించండి




**న్యూఢిల్లీ :** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తిని ప్రదర్శించి, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలు మీడియా సమావేశం నిర్వహించి, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడారు. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు ప్రజల సంపూర్ణ మద్దతు అవసరమని వారు స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు ప్రక్రియ కొంత క్లిష్టంగా ఉంటుందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు. రాష్ట్ర శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అన్ని పార్టీలు సర్దుకుపోయాయని, క్షేత్రస్థాయిలోనూ కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. సీట్లు దక్కని వారికి భవిష్యత్తులో తప్పకుండా న్యాయం చేసే బాధ్యతను కూటమి తీసుకుంటుందని పవన్ భరోసా ఇచ్చారు.కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, పారిశ్రామికవేత్తల్లో ఉన్న నమ్మకం వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని పవన్ అన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే రావడం చంద్రబాబు సమర్థ నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.30 వేల కోట్లతో 3.20 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేధింపులకు గురైన ఉద్యోగులకు రూ.30 వేల కోట్ల బకాయిలు చెల్లించామని, గంజాయిపై ఉక్కుపాదం మోపామని స్పష్టం చేశారు.

# చెప్పాం.. చేస్తున్నాం

## : కర్నూలు సోలార్ ప్లాంట్‌పై చంద్రబాబు ట్వీట్



**అమరావతి:** పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ మరో కీలక మైలురా యిని అధిగమించింది. కర్నూలు జిల్లాలో 600 మెగావాట్ల భారీ సామర్థ్యంతో నిర్మించిన సోలార్ ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభమ య్యాయి. ఈ ప్రాజెక్టు విజయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుతో స్వచ్ఛ ఇంధన (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు.ప్రముఖ సోలార్ ఎనర్జీ సంస్థ 'ఎస్ఏఈఎల్' కర్నూలు జిల్లాలో దాదాపు 2,400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రతిష్టాత్మక సోలార్ ప్లాంట్‌ను నెలకొల్పింది. 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ నుండి ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు సైతం విద్యుత్ సరఫరా జరుగుతుండటం విశేషం.ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హ్యాష్‌ట్యాగ్‌ను ఆయన తన పోస్ట్‌కు జత చేశారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ తన స్థానాన్ని తిరిగి సుస్థిరం చేసుకుంటోందని సందర్భంగా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

## ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు దసరా ఆదాయం

# రూ. 33.63 కోట్లు




**వరంగల్:** దసరా పండుగ పర్వదినం సందర్భం గా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర వేసిన ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు రూ.33.63 కోట్ల ఆదాయం వచ్చినట్లు వరంగల్ ఆర్ఎం భవాని ప్రసాద్ తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ నిర్వహించిన ప్రత్యేక బస్సు సర్వీస్‌లు విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. అక్టోబరు 9 నుంచి 25వ తేదీ వరకు 17 రో జుల పాటు రీజియన్‌లోని 9 డిపోల పరిధిలో 63.76 లక్షల కిలో మీటర్లు బస్సు సర్వీస్‌లు నడుపగా 61.07 లక్షల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చి రూ. 33.63 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు సోమవారం వరంగల్ రీజినల్ మేనేజర్ భావాని ప్రసాద్ తెలిపారు. మొత్తం ప్రయాణికుల్లో 39.98 లక్షల మంది మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు.నుమకొండ డిపో రూ. 4.25 కోట్లు, జనగామ డిపో రూ. 3.81 కోట్లు, వరంగల్ -1 డిపో రూ.5కోట్లు, వరంగల్ -2 డిపో రూ.5.74 కోట్లు, మహబూబాబాద్‌డిపో రూ.2.20 కోట్లు, నర్సం పేట డిపో రూ.2.74 కోట్లు, పరకాల డిపో రూ. 2.50 కోట్లు, తొర్రూరు డిపో రూ. 3.65 కోట్లు, భూపాలపల్లి డిపో రూ.3.69 కోట్ల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. పండుగ సమయంలో ఆర్టీసీ బస్సులను ఆదరించిన ప్రయాణికులను ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు అభినందించారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగ కుండా అంకితభావంతో విధులు నిర్వహించిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, డిపో మేనేజర్లకు ఆర్టీ యాజ మాన్యం తరపున ఆర్ఎం భవాని ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

- ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ
- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య



**హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు."రాష్ట్రం ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

# గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా: ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్



తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం సాధ్యమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు.రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. "ఇది కాలం తెచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నా ఎత్తిపోతలు చేపట్టకుండా ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని విమర్శించారు. 33 శాతం వర్షపాతం లోటు ఉన్న ఏపీలో లేని క్రాప్ హాలిడే, కేవలం 17 శాతం లోటు ఉన్న తెలంగాణలో ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు.ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, అసలు ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన తర్వాతే, తమ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆయన గుర్తుచేశారు.

# మార్చాల గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్.

**గ్రామాభివృద్ధికి సహకరిస్తామని హామీ**



**కల్వకుర్తి ప్రజావాణి ప్రతినిధి:-అక్టోబర్ 27:**
మార్చాల గ్రామ పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మార్చాల గ్రామంలో ఆకస్మికంగా పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు,ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి డైరీలోని వివరాలను పరిశీలిస్తూ, వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు,గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల (యూపీఎస్) ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు,ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపసర్పంచ్ నిజాముద్దీన్, వార్డు సభ్యులు వట్టేపు కిషోర్,మాయని సుమంత రాజశేఖర్,రజిత మల్లేష్, పర్వత్ రెడ్డి,సికింందర్, అక్షయ విశ్వేశ్వర్, యాదిరాల యాదయ్య, బిజినపల్లి స్వాతి బాలరాజు,పల్స అనురాధ జంగయ్య, కంకల అలివేల జంగమయ్య,వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బి ఆర్ ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్..



**నస్రుల్లాబాద్ అక్టోబర్ 27 (ప్రజావాణి)** నస్రుల్లాబాద్ మండలం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజకవర్గం లో మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా మంగళవారము పోలీసులు బి ఆర్ ఎస్ నాయకుల ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా గుడిసెల నరసింహులు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మహేందర్ టేకుర్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# మాచ్నూర్‌లో భూమి ఆక్రమణపై ఫిర్యాదు.. విచారణ జరిపించాలని ఎల్లమ్మ వినతి

**మాచ్నూర్, అక్టోబర్ 27 (ప్రజావాణి):**
సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఝరాసంగం మండలం మాచ్నూర్ గ్రామంలో తన పట్టా భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారని ఆరోపిస్తూ మునిపల్లి ఎల్లమ్మ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. తన భూమికి సంబంధించిన హక్కులను పరిరక్షించి, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమె కోరారు.తన పట్టాదారు పాస్ పుస్తకం నంబర్ ౧09050291318, ఖాతా నంబర్ 60496కు సంబంధించిన భూమిలో ఆక్రమణ జరిగిందని ఎల్లమ్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే కోర్టులో, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా, భూమి విషయంలో సంబంధిత వ్యక్తులు తమపై దౌర్జన్యంగా వ్యవహరించారని ఆరోపించారు.భూమి వివాదంపై విచారణ పూర్తయ్యే వరకు సదరు ఇళ్లకు సర్వే నిర్వహించకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు, ధ్రువీకరణ పత్రాలు లేదా ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు మంజూరు చేయకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి బి. రాజ్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు.సంబంధిత భూమి రికార్డులను పరిశీలించి, ఫిర్యాదుల ఆధారంగా నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఎల్లమ్మ కోరారు.





# వేల పాల లేని దూలిమిట్ట మండల సమావేశం

**అధికారుల అలసత్వం... ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం..**



**మద్దూరు అక్టోబర్27, ప్రజా వాణి,**
ధూళిమిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన మండల సమావేశం ప్రజా ప్రతినిధులు సరైనా సమయంకు రాకపోవడంతో 12 గంటల వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది. దీంతో సమావేశం పట్ల హాజరు కాని ప్రజా ప్రతినిధులకు పట్టింపు లేదని చర్చించుకుంటున్నారు. ఎటు తోయనీ పరిస్థితినీ చూసిన మండల ప్రత్యేక అధికారి శారద సమావేశాన్ని 11:45 కు ప్రారంభం చేశారు. హాజరు కాని వారికి మెమోలు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వీరరాజు, ఆయా గ్రామాల సర్పంచులు,అధికారులు,కార్యదర్శులు పాల్గొన్నారు.

# తలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం.

**రంగారెడ్డి జిల్లా...కల్వకుర్తి నియోజకవర్గం**






**అక్టోబర్ 27/ప్రజావాణి ప్రతినిధి.**
తలకొండపల్లి మండలం ఇన్స్పెక్టర్ వి. జానకిరామ్ రెడ్డి, ఎస్సై కె. శేఖర్ గారు... తలకొండపల్లి పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం తలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్టర్ వి. జానకిరామ్ రెడ్డి ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ తలకొండపల్లి జడ్పీహెచ్ఎస్ లో చదువుతున్న 8,9,10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరును, పోలీస్ స్టేషన్ లో నిర్వహించే విధులు, పౌరులు పొందాల్సిన సేవల గురించి వివరించారు. విద్యార్థులకు డయల్ 112, షీ టీమ్, సైబర్ క్రైమ్, ఆయుధాల పనితీరు, వీహెచ్ఎఫ్ సెట్ వినియోగం గురించి, రిసెప్షన్ వ్యవస్థ, సిసిటిఎన్ఎస్ పనితీరు, మరియు ఫింగర్ ప్రింట్ పై అవగాహన కల్పించారు. అనంతరం ఇన్స్పెక్టర్ జానకి రాంరెడ్డి మాటాడుతూ విద్యార్థులు జీవితంలో సాధించాల్సిన అంశాల గురించి, చదువు ప్రాముఖ్యత గురించి వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె. శేఖర్, ఏఎస్ఐ విష్ణువర్ధన్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# కల్వకుర్తిలో పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశం.

**ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి..**



**కల్వకుర్తి ప్రజావాణి ప్రతినిధి:-అక్టోబర్ 27:-.**
కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఏడ్మా సత్యం ఆధ్వర్యంలో పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు,ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొనిసమావేశంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ, ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణ,బి,ఆర్,ఎస్ పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో ఎన్నికల సన్నద్ధతపై జిల్లా,మండల స్థాయి నాయకులతో సమగ్రంగా చర్చించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో,వివిధ మండల ల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ శిల్పకళా వైభవానికి నిదర్శనం కూసుమంచి శివాలయం

**శివాలయ చరిత్ర, నిర్మాణ విశేషాలను విద్యార్థులకు వివరించిన చరిత్ర అధ్యాపకుడు సోమలింగం యాదవ్**

**కూసుమంచి అక్టోబర్ 26 ( మన ప్రజావాణి ) ప్రతినిధి**
విద్యార్థులకు చారిత్రక కట్టడాలు, ప్రాచీన నిర్మాణ శైలి, కాకతీయుల వాస్తు శిల్పకళపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం స్థానిక చారిత్రక శివాలయాన్ని సందర్శించారు. కళాశాలకు చెందిన 11, 12వ తరగతి విద్యార్థులు చరిత్ర అధ్యాపకుడు వర్రే సోమలింగం యాదవ్ ఆధ్వర్యంలో ఈ క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, నిర్మాణ విశిష్టతలు, కాకతీయుల ఇంజనీరింగ్ నైపుణ్యాలను ఆయన విద్యార్థులకు వివరించారు.సుమారు వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం కాకతీయుల వాస్తు, శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. 12వ శతాబ్దంలో కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడి కాలంలో నిర్మితమైన ఈ ఆలయం ప్రత్యేక నిర్మాణ శైలితో చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుందని వివరించారు. శిల్పకళలో ప్రత్యేకతలుఆలయంలోని భారీ నల్లరాతి శివలింగం, త్రికూటాలయ నిర్మాణం, నక్షత్ర ఆకారంలో రూపొందించిన వేదిక ప్రత్యేక ఆకర్షణలని అధ్యాపకుడు వివరించారు. రాళ్లను సున్నం లేకుండా గాడులు, కూసల ద్వారా అనుసంధానించే పద్ధతి, ఇసుక పునాది నిర్మాణ విధానం కాకతీయుల నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా



ప్రాచీన కాలంలోనే నిర్మాణ సాంకేతికతను వినియోగించిన విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు.అలాగే సూర్యచంద్రుల కిరణాలు గర్భగుడిలోని శివలింగంపై పడేలా రూపొందించిన వాస్తు విజ్ఞానం, ఛ అనుసంధానంతో కూడిన కాకతీయుల పట్టణ ప్రణాళిక విధానం గురించి వివరించారు.పుస్తకాల్లో చదివిన చరిత్రను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థులకు ప్రాచీన భారతీయ నిర్మాణ కళ, సాంకేతిక పరిజ్ఞానంపై మరింత అవగాహన కలుగుతుందని ఈ పర్యటన తెలియజేసింది.

# టేకు కలప అక్రమ రవాణా కేసులో నిందితుడికి 11 రోజుల రిమాండ్




**దండేపల్లి, అక్టోబర్ 26 (ప్రజావాణి):**
అక్రమంగా టేకు కలపను తరలిస్తున్న వ్యక్తికి న్యాయస్థానం 11 రోజుల రిమాండ్ విధించినట్లు తాళ్లపేట అటవీశాఖ అధికారులు తెలిపారు.ఈ నెల 24వ తేదీన ద్విచక్రవాహనంపై మూడు టేకు కలప ముక్కలను అక్రమంగా తరలిస్తున్న గోపతి అంజయ్య (తాళ్లపేట) అనే వ్యక్తిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సోమవారం గౌరవ ప్రథమ శ్రేణి న్యాయాధికారిణి నిందితుడికి 11 రోజుల రిమాండ్ విధించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ, ఎవరూ టేకు చెట్లను నరకడం, టేకు కలపను అక్రమంగా రవాణా చేయడం లేదా నిల్వ ఉంచడం వంటివి చేయకూడదని హెచ్చరించారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com